18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప
శనివారం 29 మార్చి 2025 : పేజీలు 8



# మాధవి మార్క్!

కడప బ్యూరో - మేజర్ న్యూస్

ఆమె రాజకీయాలకు కొత్త..
భర్త చాటు భార్య..
కడప రాజకీయాలు ఏమీ తెలుసు..
ఇక్కడ రాణించడం అంత సులువు కాదు..

ఎన్నికలకు ముందు రెడ్డెప్పగారి మాధవిరెడ్డి గురించి వినిపించిన విమర్శలు

మాధవిరెడ్డి కడప తొలిమహిళా ఎమ్మెల్యేగా గెలిచింది..
ఆమె భర్తను చూసి ఓట్లేశారులే..
ఎమ్మెల్యేగా రాణించాలి కదా!..
కడపలో నెట్టుకురావడం ఈజీ కాదులే..భయ్యా
చూస్తుండు..

ఎమ్మెల్యే మాధవీ రెడ్డి గురించి నిన్నటివరకు రాజకీయ ప్రత్యర్థులు చేసిన కామెంట్స్

ఏందన్న మన ఎమ్మెల్యే దుమ్ముదులుపుతున్నారు..
ఎదో కడపను ఉద్ధరిస్తున్నామని పోయిన పార్టీ వాళ్ళు చెప్పారు..
ఎక్కడన్నా పనులన్ని అక్కడే పెట్టేసి కనిపించిన జాగాలన్నీ కబ్జా చేశారంటకదా!..
అన్నా.. ఎమ్మెల్యే పట్టుపట్టి విచారణ చేయిస్తోందన్న..
అక్రమంగా తిన్నదంతా కక్కిస్తా అంటోంది కదన్నా..
నిజమేనన్న ఆమె అనుకుంటే చేయిస్తుందన్నా..
అన్నా ఆడమనిషి అనుకోకుండా సమస్యలన్నీ నెత్తుకెత్తుకుందన్న..
ఆమె భర్త వాసు అండతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి
ఒకటొకటే తీరుస్తా ఉందన్నా..

ఇది నేటి కడప నగర ప్రజల మనోగతం.

అభివృద్ధే లక్ష్యంగా అడుగులు
నగర సమస్యలపై అసెంబ్లీలో గళం
సీఎం బాబు, మంత్రి లోకేష్ దృష్టికి
నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళిక
అక్రమార్కుల పాలిట సింహస్వప్నం
ముక్కుసూటి మనస్తత్వం,
నమ్మినవారికి అండగా..
రాజకీయ ప్రకంపనలు సృష్టించడంలో దిట్టా
ఎమ్మెల్యేగా దూసుకుపోతున్న రెడ్డప్పగారి మాధవిరెడ్డి

ఎస్!.. మొదట్లో వచ్చిన విమర్శలకు.. ఆరోపణలకు అదరలేదు. బెదరలేదు. తన పని తాను చేసుకుంటూ పోతున్నారు. ఏడాది క్రితం తెలుగుదేశం కడప అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించకముందు ఎంత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్ళారో అంతకు రెట్టింపు ఉత్సాహంతో ప్రస్తుతం (మిగతా 2లో..)

# ప్రొద్దుటూరులో.. హైటెన్షన్ డ్రామా

- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి గుండెనొప్పి
- మరోసారి గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా




ప్రొద్దుటూరు - మేజర్ న్యూస్

ప్రొద్దుటూరు మండలం గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక హై టెన్షన్‌కు దారితీసింది. భారీ పోలీస్ బందోబస్తు.. నేతల హౌస్ అరెస్టులు..చివరకు రిటర్నింగ్ అధికారికి ఛాతీలో నొప్పి రావడంతో ఎన్నిక వాయిదా.. ఇలా శుక్రవారం ఉదయం నుంచి హైటెన్షన్ డ్రామా నడిచింది. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న జడ్పీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, మండల పరిషత్ వైస్ ఛైర్మన్లు, ఉప సర్పంచ్‌ల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 23న నోటిఫికేషన్ వెలువడించి 27న ఎన్నికలు నిర్వహించారు. అందులో భాగంగా (మిగతా 2లో..)

# మైదుకూరు ఒకటే భర్తీ

మార్కెట్ కమిటీ చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం
జిల్లాలోని 10 మార్కెట్ కమిటీల్లో మైదుకూరుకే స్థానం
మిగిలిన మార్కెట్లకు పెండింగ్..
తమ్ముళ్లలో నిరుత్సాహం.. ఎమ్మెల్యేల్లో అసంతృప్తి..
త్వరలోనే మరో జాబితా అంటున్న అధిష్టానం



కడప బ్యూరో - మేజర్ న్యూస్

ఆశావాహులను ఊరిస్తూ వచ్చిన నామినేటెడ్ పదవుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని 47 మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. ఇందులో కడప జిల్లాకు సంబంధించి కేవలం మైదుకూరు మార్కెట్ కమిటీకి మాత్రమే చైర్మన్‌ను ప్రకటించారు. మిగిలిన తొమ్మిది మార్కెట్లకు చైర్మన్లను పెండింగ్‌లో ఉంచారు. మరో జాబితా త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందని అధిష్టానం పెద్దలు చెబుతుండగా ప్రస్తుత ప్రకటనపై మాత్రం తెలుగుతమ్ముళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మైదుకూరు కమిటీ చైర్మన్‌గా ఏపీజీవి రవీంద్రకు అవకాశం దక్కింది. కడప జిల్లాలో కడప, బద్వేల్, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, సింహాద్రిపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, సిద్దవటం మార్కెట్ కమిటీలున్నాయి. వీటికి చైర్మన్ల నియామకానికి సంబంధించి రిజర్వేషన్లు పూర్తయ్యాయి. జిల్లా అధికారులు దీనికి సంబంధించి నివేదికను పంపారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీలకు చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పోస్టులకు సంబంధించి పేర్లు పంపాలని సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా నేతలకు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు ఆశావాహుల జాబితాను వడపోసి అధిష్టానానికి నివేదించారు. (మిగతా 2లో..)

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం



8లో

## అప్పుల బాధ తట్టుకోలేక యువకుడు బలవన్మరణం...!



8లో

# మరోసారి వాయిదా పడిన గోపవరం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)




ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం ఉపసర్పంచ్ స్థానానికి గురువారం ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే టీడీపీ - వైసీపీ వర్గీయుల పరస్పర ఘర్షణల నేపథ్యంలో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరులో కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ చొరవ తీసుకుని మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా వైసీపీ, టీడీపీకి చెందిన ముఖ్య నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఎన్నిక పరిసర ప్రాంతాల్లో హైటెన్షన్ చోటుచేసుకుంది. తహసీల్దార్ గంగయ్య, ఆర్డీవో సాయిశ్రీ ఎన్నిక సరళిని పరిశీలించారు. గోపవరం పంచాయతీకి సంబంధించిన వార్డు మెంబర్స్ వైసీపీ తరపున 14 మంది, టిడిపి తరపున ఆరుగురు సకాలంలో పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇక ఎన్నికే మిగిలి ఉందని భావిస్తున్న తరుణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి గుండె నొప్పి రావడంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ ప్రకటించారు. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి ఎన్నిక నిర్వహణా తేదీని తెలుపుతామని పంచాయతీ అధికారులు తెలిపారు. ఏది ఏమైనా మరోసారి ఈ ఎన్నిక వాయిదా పడటం ప్రజల్లో ఆసక్తిని రేపుతోంది. అయితే ఇదంతా అధికారులు టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, తమకు మెజారిటీ ఉన్నా ఎన్నికను వాయిదా వేశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపిస్తున్నారు

# మైదుకూరు ఒకటే భర్తీ..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎంపిక పూర్తిగా ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే జరుగుతుందని అధిష్టానం స్పష్టం చేసింది. దీంతో తాము పంపిన అభ్యర్థులను చైర్మన్‌గా నియమిస్తారని ఎమ్మెల్యేలు భావించారు. అయితే శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాతో ఎమ్మెల్యేలు సైతం నిరుత్సాహానికి గురయ్యారు. అధిష్టానం ఎందుకు పెండింగ్ పెట్టిందో అంతు చిక్కడం లేదు. కేవలం మైదుకూరు మార్కెట్ కమిటీకి మాత్రమే చైర్మన్‌ను ఎంపిక చేసి మిగిలినవి పెండింగ్ పెట్టడం ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన 47 మార్కెట్ కమిటీ పదవుల్లో 37 టీడీపీకి, 8 జనసేన, 2 బీజేపీ పార్టీలకు కేటాయించి, చైర్మన్లను ఎంపిక చేశారు. త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. కాగా, మైదుకూరు మార్కెట్ యార్డ్ నూతన చైర్మెన్ గా నియమితులైన ఏపీజీవి రవీంద్ర ను కలిసి అభినందనలు తెలిపారు.

# సంఘీభావం తెలిపిన పంచాయతీ కార్యదర్శులు




యర్రగుంట్ల, మేజర్‌న్యూస్: వీయన్ పల్లి మండలం పంచాయతీ కార్యదర్శి ఇంటిపై దాడికి నిరసనగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం సంఘీభావం తెలిపారు. వీఎన్ పల్లి మండలం పంచాయతీ కార్యదర్శి ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా యర్రగుంట్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శి సంఘం సంఘీభావం తెలుపుతూ పంచాయతీ కార్యదర్శులపై భౌతిక మరియు మానసిక దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని శుక్రవారం యర్రగుంట్ల ఎంపీడీవో వెంకట రమణయ్య మరియు ఈవో పీఆర్, ఆర్డి రహమతులయ్య వినతి పత్రం ఇచ్చారు.

# మాధవి మార్క్

(మొదటి పేజీ తరువాయి)

కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి పని చేస్తున్నారు. తన పనితీరుతోనే విమర్శకుల నోళ్ళకు సమాధానం చెప్పారు. తన మామ మాజీ మంత్రి ఆర్ రాజగోపాల్‌రెడ్డి, భర్త టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి(వాసు) రాజకీయాన్ని దగ్గరనుంచి చూసిన ఆమె నిత్యం ప్రజల్లో ఉంటూ వారిలో ఒకరిగా మెలగడం నేర్చుకున్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్సీ నిర్వహిస్తూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. వారి నుంచి వచ్చే విజ్ఞాపనలు స్వీకరించి ప్రత్యేకంగా నమోదు చేసుకుని నేరుగా అధికారులతో మాట్లాడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అవసరమైతే తన భర్త శ్రీనివాసరెడ్డితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఇక్కడే ఎమ్మెల్యే పలు అంశాలను క్షుణంగా పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు అధికంగా ఎదురవుతున్నాయి. అయితే కార్పోరేషన్ అధికారులు వీటి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించుకున్నారు. కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని గత పాలకులు చెబుతుంటే అదెక్కడా కనిపించడం లేదని ఆమె గ్రహించారు. దీంతో కార్పొరేషన్ పాలనా వ్యవహారాలపై ఎమ్మెల్యే దృష్టిసారించారు. ఫలితంగా కార్పొరేషన్‌లో అవినీతి తారాస్థాయికి చేరిందని, భారీగా అక్రమాలు జరిగాయని ఆమె దృష్టికి వచ్చింది. దీనిపై చర్చించేందుకు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కావాలని ప్రయత్నించింది. కానీ, ప్రస్తుతం కార్పోరేషన్‌లో వైసీపీ పాలకవర్గం కొనసాగుతోంది. ఫలితంగా వివాదం మొదలైంది. దీంతో కార్పోరేషన్‌లో జరుగుతున్న అక్రమాలను నిగ్గు తేల్చాలని ఆమె పట్టుపట్టారు. తన దృష్టికి వచ్చిన ఆధారాలను ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో ఇటీవల విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ పూర్తి చేశారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఎమ్మెల్యే సమర్పించిన ఆధారాలన్ని నిజమేనని విజిలెన్స్ దృవీకరించింది. ఈ నివేదిక ఆధారంగానే మేయర్ సురేష్‌బాబుకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లా రాజకీయాల్లో ఇది హాట్‌టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే మాధవిరెడ్డి పట్టుదలకు ఇదోక ఉదాహరణ మాత్రమే.

**తానేమిటో నిరూపించుకుంటూ ముందుకు..**

భర్తచాటు భార్య.. ఆమెకు ఏమి తెలుసు.. అని విమర్శించిన వారికి కడప నగర సమస్యలపై రాష్ట్ర శాసనసభలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి గళమెత్తిన తీరు గుర్తుండే ఉంటుంది. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి అసెంబ్లీ సెషన్స్‌లోనే ఆమె ఎంతో కీలకమైన గంజాయి సమస్యపై ప్రస్తావించారు. గంజాయి, వైట్నర్, సోల్యూషన్ వంటివాటి వల్ల యువత ఏవిధంగా మత్తుకు బానిసలవుతున్నారో వివరించింది. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం కదిలింది. గంజాయిపై 100 రోజుల ప్రణాళికను రూపొందించుకుని ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా వందల కిలోల గంజాయి పట్టుబడింది. ప్రస్తుతం గంజాయి కేసులు, విక్రయాలు భారీగా తగ్గాయి. అదేవిధంగా మెడికల్ షాపులలో కూడా ఎటువంటి నిబంధనలు, ఆంక్షలు లేకుండానే ఇష్టానుసారంగా మత్తుమందుల విక్రయాలు సాగుతున్నాయి. డాక్టర్స్ మందుల చీటీలు లేకుండానే ప్రమాదకరమైన మత్తుమందులను అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై కూడా ఎమ్మెల్యే మాధవిరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంతో పరిస్థితి ఎంత తీవ్రంగా ప్రభుత్వం గ్రహించింది. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ గరుడ పేరుతో మందుల దుకాణాలపై తనిఖీలు చేపట్టింది. కాగా కడపలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారు. కడప నగరంలోని ప్రతి పౌరుడికి రోజుకు 135 లీటర్ల నీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో 2018 ఫిబ్రవరిలో ప్రారంభించిన అమృత్ ఫేజ్-1 పథకం పనులు ఇంకా పూర్తికాకపోవడంపై కూడా ఎమ్మెల్యే సభలో ప్రస్తావించారు.



దీనికి స్పందించిన ప్రభుత్వం ఈపథకం పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించడమే కాకుండా అమృత్ ఫేజ్-2 పనులను కూడా చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఫేజ్-1లో కొంత కదలిక వచ్చి పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా వాటర్ గండిలో మోటర్లు, పైపులైన్ మరమ్మత్తుల అంశాలను కూడా ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. మెకానికి వృత్తి చేసుకునే వారిని కార్మిక శాఖ కింద గుర్తింపు ఇవ్వాలని, 2014కు ముందు రిటైర్మెంట్ పొందిన ఆర్టీసి ఉద్యోగులకు రేషన్‌కార్డుల మంజూరు, కడప హెూమియో కాలేజీ ఖాళీల భర్తీ, కడప నగరంలో డ్రైన్ల మరమ్మత్తులు వంటి చాలా అంశాలను ఎమ్మెల్యే మాధవిరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. నేరుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారాలోకేష్‌కు వినతిపత్రాలు సమర్పించారు. వారి నుంచి సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన హామీలు పొంది అంతటితో వదిలేయకుండా సీఎంవో అధికారులతోనూ చర్చిస్తూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయం.

**రాజకీయ ప్రత్యర్థులకు చుక్కలు..**

కడప నగరంలో గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న భూకబ్జాలపై నిగ్గుతేల్చాలని ఎమ్మెల్యే పట్టుపట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ స్థలాలు, కాల్వలు, కుంటలు ఆక్రమించి వెంచర్లు చేసి విక్రయిస్తున్నారని ఎమ్మెల్యే మాధవిరెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారు. అనుమతులు లేకుండా పలువురు ప్రముఖులు ఇష్టానుసారంగా నిర్మించిన భవనాల వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణకు అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే విచారణకు ప్రత్యేక బృంధాన్ని కడపకు పంపారు. మూడు రోజుల పాటు కడపలో పర్యటించి అక్రమాలు నిజమేనని కమిటీ నిగ్గు తేల్చింది. ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ విషయాన్ని అసెంబ్లీ వేదికగా మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో కార్పొరేషన్ అధికారులు కాస్త స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన 93 వెంచర్లను బ్లాక్ లిస్టులో పెట్టారు. ఫలితంగా చాలా మంది పేద, మధ్యతరగతి ప్రజలు మోసపోకుండా కాపాడినట్లయింది. కొన్నింటిని అధికారులు స్వాధీనం చేసుకోవడంతో ప్రభుత్వ ఆస్తులను ఎమ్మెల్యే కాపాడగలిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యేగా మాధవిరెడ్డి తనదైన మార్కు చూపుతున్నారు. పాలనాపరమైన పట్టుబిగించారు. నిజాయితీతో నిబద్ధతగా పనిచేసే అధికారులకు కొంత స్వేచ్ఛనిచ్చినా పాతవాసనలతో మసలుతున్న అధికారుల పట్ల మాత్రం కాస్త కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ కడప నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా అడుగులేస్తున్నారు. నగరానికి దిష్టిబొమ్మలా ఉన్న బుగ్గవంక సుందరీకరణ పనులను పూర్తి చేయించేందుకు, లా కాలేజీ, షామీరియా మసీదు వద్ద బ్రిడ్జిలను నిర్మించేందుకు ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇక రాజకీయ ప్రత్యర్థులకు చుక్కలు చూపుతూ నమ్ముకున్న అనుచరులకు, కార్యకర్తలను ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డి(వాసు) అండగా ఉంటున్నారన్నది నిజం. అనుచరుల ఇంట ఏ శుభకార్యం జరిగినా హాజరవుతూ ఆత్మీయ నేతలుగా గుర్తింపు పొందారు. ఏదిఏమైనప్పటికీ ఎమ్మెల్యే మాధవిరెడ్డి తనదైన మార్కుతో దూసుకుపోతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు.

# పండుగ పూట పంచాయితీ సిబ్బంది పస్తులు ఉండాల్సిందేనా !

**భాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్**

**వేంపల్లె, మేజర్ న్యూస్:** జిల్లాలోనే మేజర్ పంచాయితీ ఐన వేంపల్లి గ్రామ పంచాయితీ లో గత నాలుగు నెలలుగా 90మంది సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడం దారుణమని భాజాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం వేంపల్లి లో అయన మాట్లాడుతూ ఈనెల 7వ తారీఖున వేంపల్లి పంచాయితీ ఈఓ సుబ్బారెడ్డి సస్పెండ్ కావడంతో ఇక్కడ ఇరవై నెలలుగా ఎలాంటి పని చేయని జూనియర్ అసిస్టెంట్ జంగిటి హరికృష్ణ బిల్ కలెక్టర్ల వద్ద ఉన్న రికార్డులు స్వాదీనం చేసుకోవడంతో ప్రజల వద్ద పన్నులు వసూలు చేసే వారు లేకపోవడంతో పాటు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పారిశుద్ధ్య సిబ్బంది కోడి కూయకముందే నిద్రలేచి పట్టణంలోని చెత్తా చెదారం ,మురుగును శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని ప్రతి నిత్యం కాపాడే కార్మికులకు ఉగాది పండుగ ముందర జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని చెప్పారు. గతంలో గ్రామ పంచాయితీ లో కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందనే ఆరోపణలు,విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడికి ఏ అధికారి రావడం లేని కారణంగా పారిశుద్ధ్య కార్మికుల పాలిట శాపంగా మారిందని అన్నారు. కావున జిల్లా పంచాయితీ అధికారులు స్పందించి వేంపల్లి గ్రామ పంచాయితీ సిబ్బంది పై మానవత్వంతో కనికరం చూపి జీతాలిచ్చి ఉగాది పండుగ జరుపుకునేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు లక్ష్మిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు మొయిల్ల ఈశ్వర్ రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్ కుమార్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగల చంద్ర, నాగ ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు కంతూరి వెంకటేష్, జనసేన నాయకులు శోక్కం మల్లికార్జున, రౌతు నాగేంద్ర, దేవా, పసుపులేటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


## వక్ఫ్ బోర్డు బిల్లు కు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: ముస్లింల హక్కులను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు దేశవ్యాప్తంగా చేపడుతున్నటువంటి నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రొద్దుటూరు పట్టణంలో కూడా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం కనుక ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మరియు బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఎంపీల ద్వారా పార్లమెంటులో ఈ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయించాలని ముస్లింల తరపున మరియు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, జమా అతే ఇస్లామి హింద్ కడప జిల్లా అధ్యక్షులు హుస్సేన్ అహ్మద్, సభ్యులు రహమతుల్లా అల్లా బకాష్, వాజీద్, జాఫర్, రసూల్, ఇంతియాజ్, షరీఫ్ ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగి రామసుబ్బన్న మృతి

### నివాళులర్పించిన వైయస్ మనోహర్ రెడ్డి



పులివెందుల, మేజర్‌న్యూస్: పులివెందుల ఆర్టీసీ డిపో కంట్రోలర్ గా పనిచేసి రిటైర్ అయిన ఆర్టీసీ ఉద్యోగి రామసుబ్బన్న గురువారం సాయంత్రం మృతి చెందారు. స్థానిక బాకరాపురంలో నివాసం ఉంటున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రామసుబ్బన్న మృతి విషయం తెలుసుకున్న పులివెందుల పట్టణ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా నాయకులు సూరి, కృష్ణమూర్తి ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్సు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు, జర్నలిస్టు కిట్టు, రాజు, అమర్ తదితరులు నివాళులర్పించారు. అలాగే పలువురు ఆర్టీసీ నాయకులు ఉద్యోగులు కూడా రామసుబ్బన్న మృతదేహానికి నివాళులర్పించారు.

## అంధుల ఆశ్రమంలో అన్నదానం



పులివెందుల, మేజర్‌న్యూస్: పులివెందుల లోని శ్రీ వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమంలో శుక్రవారం డాక్టర్ ఆర్ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామిశెట్టి శివశంకర్ తండ్రి రామిశెట్టి వీరభద్రయ్య వర్ధంతిని పుర స్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు మాట్లాడుతూ హెడ్ కాని స్టేబుల్ వీరభద్రయ్య అందరికీ చిరపరిచితుడని, విధి నిర్వహణలో ఎంతో మందికి చక్కని సేవలు అందించేవారన్నారు . అధికారులు కూడా ఆయన సేవ లను ప్రశంసించే వారిని కొనియాడారు. పోలీస్ విధుల్లో ఎంతో సౌమ్యంగా అందరికీ మంచిగా ఉండేవారని పేర్కొన్నారు. అందులకు, వృద్ధులకు అన్న దాన వితరణ అనంతరం అందరికీ వాటర్ బాటిల్లును డాక్టర్ ఆర్ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ రామిశెట్టి శివశంకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అం ధుల ఆశ్రమ నిర్వాహకులు రామమోహన్ ,డాక్టర్ ఆర్ఎస్ఎస్ ఫౌండేషన్ ప్రతి నిధి ప్రణీత్ రాయల్ పలువురు పాల్గొన్నారు.

## లింగాల మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు వినతి పత్రం



లింగాల, మేజర్‌న్యూస్: లింగాల మండల పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. వీరపునాయని పల్లె పంచాయతీ కార్యదర్శి ఏ, నాగభూషణ్ రెడ్డి ఇంటి పైన వేంపల్లి లో శుక్రవారం రాత్రిపూట కొందరు వ్యక్తులు ఉద్దేశపూరితంగా దాడి చేయడం జరిగింది. అందుకు ఏ నాగభూషణ్ రెడ్డికీ సంఘీభావం తెలుపుతూ లింగాల మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలపడం జరిగింది. అనంతరం పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యల మీద ఎంపీడీఓ శ్రీనివాసుల రెడ్డి కీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల మండలంలోని పంచాయతీ కార్యదర్సులు పాల్గొన్నారు.

## పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష తేదీ మార్పు


కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : వైయస్సార్ కడప జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు, విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడమే మనగా ఈనెల 31వ తేదీన జరగవలసిన పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షను ప్రభుత్వ ఆదేశానుసారం 01.04.2025వ తేదీ మంగళవారం నకు మార్చుడమైనది. 31వ తేదీ సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పిలవుదినముగా ప్రకటించడమైనది. కావున ఆరోజున జరగవలసిన సాంఘిక శాస్త్రం పరీక్షను మరుసటి రోజుకి అనగా 01-04-2025వ తేదీ మంగళవారం రోజున ఉదయం 09.30 గంటల నుండి 12.45 గంటల వరకు జరుగును. ఈ మార్పును సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విధిగా తల్లిదండ్రులకు మరియు విద్యార్థిని విద్యార్థులకు కచ్చితంగా చేరలా చూడాలన్నాడు. ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న భూపేష్ రెడ్డి



యర్రగంట్ల, మేజర్‌న్యూస్ : రంజాన్ మాసం సందర్భంగా, యర్రగుంట్ల పట్టణంలో, మండలంలోని ముస్లిం సోదరులకు, ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన, శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి , జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బారామిరెడ్డి అనంతరం ముద్దనూరు రోడ్డు నందు ఉన్న జామియా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందజేశారు. అనంతరం భూపేష్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్షలలో ఇఫ్తార్ అందజేయడం వంటి పుణ్యకారం అని, పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఎంతో నిష్టతో 41 రోజులు ఉపవాసాలు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం ఎన్డీఏ కూటమి ఇన్చార్జి మధుసూదన్ రెడ్డి, ముస్లిం సోదరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యదర్శి ఇంటిపై దాడి ఖండిస్తూ నిరసన



వల్లూరు మేజర్‌న్యూస్ : వివిఎన్ పల్లె గ్రామపంచాయతి కార్యదర్శి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం వల్లూరు మండల గ్రామ పంచాయతి కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు, ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు, ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ పంచాయతి కార్యదర్శుల మండల అధ్యక్షు లు కరిముల్లా, ఉపాధ్యక్షులు ఓబులేసు, ట్రెజరీ శ్రీనివాసులు, జనరల్ కార్యద ర్శి సునీత తోపాటు ఇతర గ్రామపంచాయతిల కార్యదర్శులు పాల్గొన్నారు..

## ఆరోగ్యకర జీవనానికి మూలాధారం మంచి నీరే




ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: ఆరోగ్యకర జీవనానికి మూలాధారం మంచి నీరే అని మాజీ కౌన్సిలర్ అంజి దంపతులు అన్నారు. శుక్రవారం బ్రహ్మ కుమారీలు ఓం శాంతి భవన్ వారి ఆద్వర్యంలో గాంధీరోడ్ లోని సిఎన్ఆర్ హాస్పిటల్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంను బి. కె. శాంత, కాశినా నాగ మల్లేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజి దంపతులు ప్రారంభించారు. ఈ సంధర్భంగా బ్రహ్మకుమారి శాంత మాట్లాడుతూ సర్వ ప్రాణి కోటి కి నీరు అత్యంత ప్రధానమని , సర్వ కాలాల యందు మనిషి ఆరోగ్యకర జీవనానికి మూలాధారం మంచి నీరు అని,వేసవి కాలం లో వచ్చే పాలు రాకాల వ్యాధుల నుండి రక్షించుకోవడానికీ ప్రతి ఒక్కరు రోజుకు 4 నుండి 5 లీటర్లు వరకు మంచి నీరు విధిగా త్రాగాలని సూచించారు. రోజుకి 750 లీటర్ల నీరు చొప్పున 80 రోజులకు చలివేంద్రానికి కావలసిన పూర్తి మినరల్ వాటర్ ను దివంగత కాసిన నర్సిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారిడు కె.నాగమల్లేశ్వర రెడ్డి ఉచితంగ సరఫరా చేస్తున్నట్లు తెలియజేశారు. వారంలో రెండు రోజుల పాటు భాటసారులకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఓంశాంతి భవన నిర్వహకురాలు తెలియజే శారు. ఈ సందర్భంగా పాధాచారులకు, దాహర్తిలకు మజ్జిగ వితరణ గావించారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామాన్లు దగ్ధం



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్: పోరుమామిళ్ల మండలంలోని దమనపల్లె గ్రామంలో గురువారం రాత్రి సోమిశెట్టి సీతా రామయ్య గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, మంచాలు, బట్టలు తదితర సామాన్లు, డబ్బులు, మరియు విలువైన పేపర్లు (ఆధార్, రేషన్, పొలాలకు సంబంధించినవి) దగ్ధమైనట్లు సోమిశెట్టి భూలక్ష్మి దేవి తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు ఆమె తెలిపారు. సుమారు రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం స్పందించి సహాయం చేయాలని వారు కోరారు.

## మైదుకూరులో ఫ్రై - డే డ్రై - డే కార్యకమం



మైదుకూరు, మేజర్‌న్యూస్ : మైదుకూరు మున్సిపాలిటీలోని పార్వతీపురంలో జరుగుతున్న ఫ్రై - డే, డ్రై - డే కార్యకమాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. నాగరాజు గారు ఆకస్మిక తనిఖీ చేసారు. దోమల నివారణ వాటివల్ల వ్యాపించే వ్యాధుల పై పార్వతీపురం ప్రజలకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. వి.మల్లేష్, సీనియర్ ఎపిడమలాజిస్ట్ ఖాజా మొహిద్దీన్, మెడికల్ ఆఫీసర్ డా. అయేషా, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, బి.నరసింహ రెడ్డి, డి. వెంకటేశ్వర్లు, ఆశలు పాల్గొన్నారు.



## పాస్‌పోర్టు పోయినది

I, CHINTHAKUNTA SIVA REDDY, S/o Venkata Subbareddy Chinthakunta, residing at #45/150-12-1-1-3, Elite Enclave Apartment, Chemmu miahpeta, Kadapa, YSR District, have lost my passport bearing number K3368453, issued on 11.06.2012 by the Regional Passport Office, Hyderabad. The passport was lost on 15.03.2025 at I.T.I. Circle, Kadapa. If found, please contact me at above address.

## మాస శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శుక్రవారం మాస శివ రాత్రి మహా పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుండి స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఉదయం ఆరు గంటలకు గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు, తదనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అర్జిత కళ్యాణం కార్యక్రమాలు ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ చైర్మన్ కొత్త మిద్దె రఘురామి రెడ్డి, పాలక మండలి ఆధ్వర్యంలో అర్చకులు, వేద పాఠశాల గురువు వారి శిష్య బృందంతో ఘనంగా నిర్వహించారు.

## ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు




వేంపల్లె, మేజర్‌న్యూస్: స్థానిక పులివెందులలో రోడ్ లోని సంసిద్ధ సతీష్ రెడ్డి స్కూల్‌లో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. కబడ్డీ, ఖో,ఖో, ఒంటరి నృత్య పోటీలు, జంట నృత్య పోటీలు, గుంపు నృత్య పోటీలలో సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో స్వామి వివేకానంద హై స్కూల్, శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, ఉషాకిరణ్ హై స్కూల్, రాఘవేంద్ర హై స్కూల్, పులివెందుల వివేకానంద హై స్కూల్, శ్లోక ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, తదితర పాఠశాల విద్యార్థులు వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఆన్లైన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలతో విద్యార్థులు ఇతర పాఠశాల విద్యార్థులతో పోటీపడేందుకు పోటీ భావన, పరస్పర సహకారం, విలువైన అనుభవం కలిగించే ఉత్తమ వేదికగా నిలిచింది. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## కాపునాడు ఆధ్వర్యంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



వేంపల్లె, మేజర్‌న్యూస్: స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి దేవస్థానంలో, రాయల్ కాపునాడు ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం 2025-26 కు సంబంధించిన నూతన తెలుగు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, రాయల్ కాపునాడు యూత్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కావలి కృష్ణతేజలు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా మరియు రాజకీయపరంగా సంఘీయులను పటిష్టం చేయాలన్న సిద్ధాంతంతో రాయల్ కాపునాడు ఆవిర్భవించిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాపు, బలిజ, తెలగ మరియు ఒంటరి ఉపకులాలను సంఘటితం చేస్తూ పరస్పర సహాయం పొందేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నామని, ఈ సందర్భంగా వారు తెలియజేశారు. శతసం వత్సరముల చరిత్ర కలిగి ఉండి, బలమైన కార్యవర్గం కలిగివున్న, వేంపల్లి బలిజ సంఘంలో "రాయల్ కాపునాడు" నూతన తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ జరగటం శుభపరిణామం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప,కటిక చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య,ఆరుపేర్ల రంగయ్య, బలిజ సంఘం కార్యవర్గ సభ్యులు పద్మా రాజ్ కుమార్, గాలి హరిప్రసాద్,పసుపులేటి రాము,దాసరి రవిశంకర్, రాయల్ కాపునాడు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పై సమీక్ష ఆరు శాఖల సందర్శన

### వైవియు వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు



పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్ : యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను షురూ చేశారు. జాతీయ విద్యా విధానం -2020 ని ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన రసాయన శాస్త్రం,భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, బయోటెక్నాలజీ, గణితం శాఖల ను సందర్శించారు. ఆయా శాఖల విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి కులపతి ముందు వివరించారు. వారి భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక, లక్ష్యాలను , శాస్త్రీయ నిర్దేశాలను స్పష్టం చేశారు. పరిశోధన ప్రచారం కోసం విజన్ డాక్యుమెంట్/వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించడం గురించి వివరించారు. వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు సూచన చేస్తూ మౌలిక సదుపాయాల కల్పనలో పూర్వ విద్యార్థుల సహాయం తీసుకోవాలన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద నైపుణ్య కేంద్రాలు/విద్యా ప్రయోగశాలలు/పరిశోధన కేంద్రాల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు పరిశ్రమలు సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను పొంది బోధనా అభ్యాస వనరులను బలోపేతం చేయాలన్నారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించేందుకు అధ్యాపకులను ప్రోత్సహించాలని. వినూత్న పరిశోధన సంస్కృతిని ప్రోత్సహించాలని, విద్యాలయం నుంచి బయటికి విద్యార్థులు స్థానిక , గ్లోబల్ సమస్యలను పరిష్కరించేలా మనం తయారు చేయాలన్నారు. శాఖల వారీగా మరిన్ని సూచనలు చేశారు. ఉపకులపతి వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి , కుల సచివులు ప్రొఫెసర్ పద్మ,, ఐ క్యు ఏసి డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ ఉన్నారు...

# హార్డ్ వర్క్ చేస్తేనే విజయం - ఆర్డీవో సాయిశ్రీ




ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: హార్డ్ వర్క్ చేస్తేనే విజయం సాధ్యమని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఒడిస్సీ 2కె25(కాలేజీ డే) ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ, గౌరవ అతిథిగా ప్రొద్దుటూరు తహసీల్దారు గంగన్న, రాజేశ్వరి బి.ఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలిరెడ్డి, సాయి రాజేశ్వరి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామానుజమ్మ పాల్గొన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి అతిథులకు విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సాయి శ్రీ మాట్లాడుతూ జీవితంలో విజయాలు సాధించాలనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఇది కేవలము క్రమశిక్షణ హార్డ్ వర్క్ ద్వారానే సాధించవచ్చు అని, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ను మనకు ఉపయోగపడే చాలా విషయాలు నేర్చుకోవడానికి మాత్రమే ఉపయోగించడము ద్వారా విజయాన్ని సాధించగలం అని అన్నారు. ప్రొద్దుటూరు తహసీల్దార్ గంగన్న మాట్లాడుతూ మీలో చూస్తున్న ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని చూస్తుంటే నా వయసు 61 నుండి 16 కు తగ్గిందా అనే అంత వాతావరణము కనిపిస్తుంది అని అన్నారు. చైర్మన్ మాట్లాడుతూ ఏ వయసులో చేయాల్సిన పని ఆ వయసులో చేయాలనీ అంతకుమించి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. కరస్పాడెంట్ వీరకల్యాణ్ రెడ్డి మాట్లాడుతూ సమాజం బాగుంటే మనము బాగుంటాము అని ఎక్కడ ఎవర్ని బాధపడ కూడదని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి చైర్మన్ సెక్రటరీ ప్రిన్సిపాల్ కృషి మరియు అధ్యాపకుల బోధన వల్ల రెండు లక్షల వేతనం ఇవ్వబడే కళాశాల నలభై లక్షల వేతనాలు ఇవ్వగలిగే దశకు అభివృద్ధి చెందింది అని అన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2009 లో 80 మందితో మొదలైన అప్పటి బిట్స్ కళాశాల 2016 లో ఎస్ఆర్ఐటి పేరుతో అభివృద్ధి దిశగా పయనించి 2023 లో ఎన్బీఏ, నాక్, అటానమస్ పొంది విద్యార్థుల ఉద్యోగ అవకాశాల కొరకు 36 కంపెనీలతో ఎంఓయూ చేసుకోవడం జరిగిందని 2024 లో జాతీయ స్థాయిలో ఏఏపి రాంక్ సాధించడము జరిగిందని జిల్లాలో ఎన్ఐటిటిటిఆర్, ఒపి జిందాల్ తో ఎంఓయూ చేసుకున్న ఘనత మా కళాశాలకే చెందిందని, నేడు 2400 మంది విద్యార్థులతో కలశాల నిర్వహించబడుతుంది గర్వాంగా చెప్పగలుగుతున్నానని అన్నారు. కాలేజీ డే సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులు, 2025 మెరిట్ సాధించిన విద్యార్థులకు నగదు అవార్డు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులు అలరించాయి. కార్యక్రమములో హెచ్.ఓ.డి లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాచమల్లు మాట తప్పడం వలనే గోపవరం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక రసాభాస




ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: రాచమల్లు మాట తప్పడం వలనే గోపవరం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నిక రసాభాసగా మారిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో గోపవరం పంచా యతీ ఎన్నికల సమయంలో సర్పంచ్ ఎస్సీ అభ్యర్థి కి వెళ్లడంతో ఎన్ని కలలో ఖర్చు పెట్టే నాయకుని కోసం ఉప సర్పంచి పదవిని ఇరువురు వ్యక్తులకు రెండున్నర సంవత్సరాల చొప్పున అందించేలా ఒడంబడిక కుదిర్చి, బీరం రాఘవేంద్ర రెడ్డి, కొండయ్య లతో ఖర్చు చేయించారని, తిరిగి రాఘవేంద్ర రెడ్డితో కొంత డబ్బు తీసికొని అతనికి తొలి రెం డున్నర సంవత్సరాలు ఇవ్వడం ఆనందమేనని, కానీ ప్రస్తుతం రెండు న్నర సంవత్సరాలు కొండయ్య కోడలు రమాదేవి కి ఇవ్వాల్సిన తరు ణంలో మాట తప్పడం వలనే ఈ దుస్థితి దాపురించిందని వివరిం చారు. గురువారం ఎన్నిక సమయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వారి వార్డు మెంబర్లను తీసుకుని రావచ్చు కదా అని ప్రశ్నించారు. శుక్రవారం కూడా రమాదేవి న్యాయంగా తనకు రావాల్సిన ఉప సర్పంచి పదవి కోసమే పోరాడారని వివరించారు. గతంలో గోపవరం పంచాయతీ కార్యదర్శి గా గురు మోహన్ వున్న సమయంలో దోచుకొని పంచుకున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అవినీతిని కప్పి పుచ్చుకొనేందుకే జిల్లా నాయకులను పిలిపించుకున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గురువారం అధికారులను పొగిడి, శుక్రవారం దుర్భాషలాడటం ఆయన రెండు నాలుకల ధోరణికి నిదర్శనమన్నారు. ఉప సర్పంచి ఎన్నిక కోసం క్యాంపు రాజకీయాలు చేసిన ఘనత రాచమల్లు దే అన్నారు. గతంలో గోపవరం పంచాయతీలో టిడిపి నాయకులను నామినేషన్ కూడా వేయకుండా చేసిన విషయం గుర్తు లేదా అన్నారు. రిటైర్డ్ ఎస్పై శంకర్ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బాష జుగుప్సాకరమన్నారు. బిసి లను మోసం చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కొండయ్య, పగిడేల దస్తగిరి, వద్ది బాలుడు, గోపవరం టిడిపి నాయకులు పాల్గొన్నారు.


# మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం






**పులివెందుల మేజర్‌న్యూస్:** పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగ్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, కమిషనర్ రాముడు, వైస్ చైర్మన్ హఫీజ్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముందుగా అజెండాలోని అంశాలను మున్సిపల్ అధికారులు చదివి వినిపించారు. అనంతరం మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డు కౌన్సిలర్ కు తెలిపి వార్డులలోని పనులు నిర్వహించాలన్నారు. చిన్న రంగాపురం వార్డులో సచివాలయం మరొక చోటికి మారుస్తున్నటువంటి విషయం అవార్డు కౌన్సిలర్ ద్వారా చైర్మన్ దృష్టికి కౌన్సిలర్ తెలుపగా, కౌన్సిలర్ కు కూడా తెలియకుండా ఎందుకు మార్చే ప్రయత్నం జరుగుతోందని కమిషనర్ ప్రశ్నించగా, కమిషనర్ ఒక అర్జీ రూపంలో మాత్రమే వచ్చిందని కౌన్సిలర్ సమావేశంలో ఆమోదం తెలిపే విధంగా చర్యలు చేపడతామని అర్థం కాని సమాధానంగా తెలపడం దేనికి సమానమని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. అంతేకాకుండా పులివెందుల పురపాలక కౌన్సిలర్లు వార్డులలో ఏమైనా సమస్య తలెత్తినప్పుడు మున్సిపల్ అధికారులు ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తకుండా సమాధానం తెలుపకుండా ఇష్టానుసారంగా ఉన్నారని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ఏది ఏమైనా మున్సిపల్ అధికారుల దృష్టికి కౌన్సిలర్లకే సమాధానం తెలుపకపోతే వార్డులలో సమస్యలు ఏ విధంగా తెలుస్తాయని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మున్సిపాలిటీలోని సమస్యల పట్ల దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. వాటిలో భాగంగా మెప్మా సిబ్బంది మెప్మా మార్ట్ గురించి సరైన నిర్ణయం తీసుకునే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కో ఆప్షన్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తమ అభ్యర్థి ఉప సర్పంచిగా గెలిచే అవకాశం వుందనే ఎన్నిక వాయిదా



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాఘవ రెడ్డి గోపవరం పంచాయతీ ఉప సర్పంచిగా గెలిచే అవకాశం ఉందనే కారణంగానే ఎన్నిక రెండో సారి వాయిదా పడిందని కడప జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నివాసంలో వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ దౌర్జన్యంగా, అప్రజాస్వామికంగా వైసీపీ వార్డు మెంబర్స్ ను గురువారం భయభ్రాంతులకు గురి చేయడం, శుక్రవారం ఏకంగా ఎన్నికల అధికారి గుండెపోటు అంటూ హై డ్రామా నిర్వహించి వైసీపీ అభ్యర్థి గెలుపుకు అడుగు దూరంలో వుండగా ఉప సర్పంచి ఎన్నిక వాయిదా పడిందని వివరించారు. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం సరి కాదన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గతం నుండి కూడా ఇదే తరహా ఒరవడిని అవలంబించేవారని, అతని వర్గీయులకే అధికారం దక్కాలనే దుర్బుద్ధి కలవాడని విమర్శించారు. కానీ ఈ విషయంలో గెలుపు వైసీపీ దే అన్నారు. ప్రజలు ఇలాంటి చర్యలను గుర్తుంచుకొని భవిష్యత్తులో వరదరాజులరెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, జడ్పీ ఛైర్మన్ రామ గోవింద రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, గోపవరం సర్పంచి మోషే, వార్డు మెంబర్స్, వైసీపీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నారు.

# పోటాపోటీగా జంతువధశాల వేలంపాట

## మూడు లక్షల 25 వేల వరకు సాగిన పాట

**ముద్దనూరు మేజర్‌న్యూస్:** ముద్దనూరు గ్రామపంచాయతీకి సంబంధించిన 2025 -26 సంవత్సరమునకు గాను, జంతువధశాలకు నిర్వహించిన వేలంపాట, వేలంపాటదారులు మధ్య ఫోటో పోటీగా సాగింది. శుక్రవారం ముదునూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మి నరసింహులు ఆధ్వర్యంలో ముద్దనూరు గ్రామపంచాయతీ సంబంధించిన జంతువధశాలకు వేలంపాటకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఈ ఓ పి ఆర్ డి వీరభద్రుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జంతువధశాలకు నిర్వహించిన వేలంపాట పోటాపోటీగా సాగింది. మూడు లక్షల 25 వేల వరకు వేలంపాట సాగింది. ముందుగా ఒక లక్ష 54 వేల తో సర్కార్ వారి పాటతో వేలం పాట మొదలైంది. ఆ అనంతరం వేలంపాటదారుల మధ్య పోటాపోటీగా సాగి చివరికి మూడు లక్షల 25 వేలకు మంటి లక్ష్మీదేవి వేలంపాటను పాడడంతో, హెచ్చు పాట దారునిగా ఉండడంతో 2025 -26 సంవత్సరానికి గాను వారికి హక్కులను ఇవ్వడం జరిగిందని ముద్దనూరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మి నరసింహులు తెలిపారు. అయితే గత సంవత్సరం ఈ జంతువధశాల వేలంపాట ఒక లక్షా 33 వేల వరకూ పాట జరిగిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత సంవత్సరం మూడు లక్షల 25 వేల వరకు వేలంపాట సాగడంతో ప్రస్తుతం ముద్దనూరు గ్రామపంచాయతీకి దాదాపు రెండు లక్షలు దాకా ఆదాయం రావడం జరుగుతుంది.



**బస్టాండు వేలంపాట వాయిదా:**

ముద్దనూరు గ్రామపంచాయతీ సంబంధించి 2025- 26 సంవత్సరానికి గాను జరగాల్సిన బస్టాండ్ వేలం పాటను 29వ తేదీకి వాయిదా వేసినట్లు ముద్దనూరు గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు తెలిపారు. ఎవ్వరూ డిపాజిట్ చెల్లించనందున ఈ వేలంపాటను ఈనెల 29 కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు ఈవేళ పాటను నిర్వహిస్తామని . కార్యదర్శి లక్ష్మీ నరసింహులు వివరించారు.

# ఎంబెడెడ్ టెక్నాలజీ పై వర్క్ షాప్




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ మరియు నాల్గొవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాడార్ టెక్నికల్ సెంటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ డొమైన్ పై రెండురోజులు వర్క్ షాప్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి సిద్దేశ్వర రావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాడార్ టెక్నికల్ సెంటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సురేష్ పాల్గొని విద్యార్థులకు రెండు రోజులు ఎంబెడెడ్ సిస్టమ్స్ డొమైన్ ప్రాముఖ్యత, ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ప్రస్తుతం ప్రతి ప్రాముఖ్య రంగంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ టెక్నాలజీ వాడుతున్నారని ఉదాహరణకు రోబోటిక్స్, స్మార్ట్ ఫోన్స్ తయారీలో, వైద్య , డిఫెన్స్, ఆర్మీ, వ్యవసాయం మొదలగునవని, అందువలన ఎంబెడెడ్ సిస్టమ్స్ టెక్నాలజీ నేర్చుకుంటే ఉద్యోగ ఉఫాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. అలాగే ఎంబెడెడ్ సిస్టమ్స్ టెక్నాలజీని సులభంగా 2నెలల్లో ఎలా నేర్చుకోవాలో ఇంటర్వ్యూలు ఎలా ఎదుర్కొనాలో వివరంగా తెలిపారు. ఈ కారక్రమానికి హెచ్ వో డి లు ఎస్.ఎమ్.కె. సుకుమార్ రెడ్డి, పి.ఎం.నాసిర్ హుస్సేన్, కె. రామమోహన రెడ్డి, వి నరసింహ స్వామి, ఎమ్.వి.వి. ప్రసాద్, ఏ.ఓ. ఎమ్. రజనీకాంత్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి నారాయణాచార్యులు కారుణ్యజన్ముడు




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** శివతాండవం వంటి మహాకావ్య సృష్టి కోసమే జన్మించిన కారణజన్ముడు మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు అని పుట్టపర్తి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక ఆగస్త్యేశ్వరాలయంలో పుట్టపర్తి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టపర్తి వారు పూర్వజన్మ సుకృతం చేతనే బాల్యంలోనే భారత భాగవతాల గ్రంధాలను ఆపోసనబట్టిచందస్సు సైతం తెలియని చిన్న వయసులో 12వఏటనే పెనుగొండ కావ్యం రాశారని తర్వాత తన జీవిత కాలంలో 150 గ్రంధాలు రాసిన అపర మేధావి అని 14 భాషల్లో పాండిత్యం కలిగిన గొప్ప మహనీయులను కొనియాడారు. శివతాండవం ఇతరులు ఎవరు రాయటానికి వీలుకాని అని సాధ్యమైన కావ్యమని సంగీత సాహిత్య నృత్యం కూడిన కావ్యమని అటువంటి కావ్యాన్ని ఆంధ్ర సరస్వతికి ఆభరణంగా ఆయన అందించాలని ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో వేద పాఠశాల విద్యార్థులు అధ్యాపకుడు వెంకటేశ్వర శర్మ,మహేష్, ఉదయ్, పీఠం సహాయ కార్యదర్శి కొత్తపల్లి శీను, కాశీవరపు వెంకటసుబ్బయ్య, పల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించిన ఆర్డీవో జాన్ ఎర్విన్



**కమలాపురం, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులో వచ్చిన అర్జీలలో 60 శాతం అర్జీలను సంతృప్తికరముగా పరిష్కరించామని కడప ఆర్డీవో జాన్ ఎర్విన్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పంచాయతీల వారీగా రివ్యూ నిర్వహించారు. ఏ పంచాయతీలలో ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కారం అయ్యాయి పెండింగ్లో ఉన్నవి అన్నీ పరిష్కారం కాకపోవడానికి కారణాలు ఏమిటి అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప రెవిన్యూ డివిజన్ పరిధిలో జరిగినవి రెవిన్యూ సదస్సులో4423 అర్జీలు వచ్చాయని అందులో 60 శాతం అర్జీలను తహసిల్దార్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి సంతృప్తికరముగా పరిష్కరించామన్నారు. మిగిలినవి కోర్టు సమస్యలున్న కుటుంబ తగాదాలున్నవి మాత్రమే మాత్రమే నన్నారు. అయితే కోర్టు సమస్యలు ఉన్న వారిని కూడా పిలిపించి మాట్లాడమని మాట్లాడమని, రాజి ధోరణిలో వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. కుటుంబ వివాదాలు ఉన్న సమస్యలను సైతం ఇరువర్గాలు రాజీకి వచ్చి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇంకపై ప్రజలకు తెలియని సమస్యలను కూడా తామే వారిని తెలియజేసి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఏడాదిలోపు కాలములో రెవెన్యూ సమస్యలు లేకుండానే చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని, అందులో భాగముగా ఉన్నతాధికారుల సలహాలు సూచనలు మేరకు రెవిన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ముఖ్యముగా కమలాపురం ఏరియా మిగులు, ఇనాం భూములకు సంబంధించిన 500 వరకు అర్జీలు వచ్చాయని, జెసి సూచనల మేరకు దాదాపుగా ఎక్కువ శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శివరామిరెడ్డి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# పంచాయతీ కార్యదర్శి ఇంటిపై దాడి అమానుషం



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** వీరపునాయన పల్లె పంచాయతీ కార్యదర్శి లాగ భూషణ్ రెడ్డి ఇంటిపై దాడి చేయడం అమానుషమని పోరుమామిళ్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో రమణారెడ్డికి వినతిపత్రం ఇవ్వడంతో పాటు నినాదాలు చేయడం జరిగింది. సంఘం ప్రతినిధులు సుందర్ కుమార్, సీనియర్ కార్యదర్శులు ఓబులేసు, రాజీవ్ రెడ్డి, నారాయణ బాబు, చెన్నకేశవరెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలలో చేరేవారు ఉండరని ఆవేదన వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే కార్యాలయాల్లో సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి తప్ప దాడి చేయడం అనాగరికమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఉన్నత అధికారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**సింహాద్రిపురం మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు శుక్రవారం గురుజాల గ్రామం నందు చెత్త సేకరణ, త్రాగు నీటి సరఫరా, ఉపాధి హామీ పనులను పంచాయతీ సెక్రటరీ విశ్వేశ్వరరావు మరియు ఉపాధి హామీ ఈసీ శ్రీనివాసరెడ్డి ఎంపీడీవో ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలను పనుల ఎండవేడిమికి గురికాకుండా ఉదయం పూటే పనులకు వచ్చి సకా లంలో పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. పనుల్లేని కూలీలకు ఉపాధి హామీ పనులు ఎంతగానో తోడ్పడు తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమిత భూమిని తొలగించాలని కాసినాయన తాసిల్దారుకు ఆర్డిఓ ఆదేశాలు



**కాశినాయన, మేజర్‌న్యూస్:** కాసినాయన మండలం గొంటువారిపల్లె గ్రామములో 12 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఆక్రమణ జరిగిందని అనేకసార్లు ఆర్డీవో దృష్టికి రావడంతో శుక్రవారం ఆర్డీవో చంద్రమోహన్ స్పందించారు. ఈ మేరకు కాసినాయన తాసిల్దారు వెంకటసుబ్బయ్య కు తక్షణమే ఆక్రమణ వాగుకు హద్దులు నిర్ణయించి ఆక్రమిత భూమిని తొలగించి వారి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో చంద్రమోహన్ ఆదేశాలు జారీచేశారు. ఆర్డీవో ఆదేశాలతో తాసిల్దార్ వెంకటసుబ్బయ్య వెంటనే స్పందించి ఆక్రమణ వాగును పరిశీలించి, ఎర్ర జండాలు పాతి హద్దులు నిర్ణయించారు.రెండురోజులలో ఆక్రమిత భూమిని తొలగించి ప్రభుత్వ వాగును స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాయబ్ రసూల్, సర్వేయర్ నవదీప్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# నువ్వులపంటకు, బూడిద తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి



**కలసపాడు: మేజర్‌న్యూస్:** కలసపాడు మండలంలో రైతులు నువ్వుల పంట సాగుచేసిన రైతులు తమ పంట సాగుచేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని నువ్వుల పంటలో భూడిద తెగులు లక్షణాలను గుర్తించాలని మండల వ్యవసాయ అధికారి జాఫర్ షరీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నువ్వుల పంట సూచనలు సలహాలు పాటించాలని సూచించారు.ఆకులపై బూడిద తెగులు లక్షణాలను గుర్తించాలని రైతులకు అవగాహన కల్పించి వివరాలు తెలియాజేశారు. ఆకులపై బూడిద వంటి పదార్థం ఏర్పాడుతుందని గింజ బరువు తగ్గి దిగుబడి పై ప్రభావం చూపుతుందని తెలిపారు. నివారణ మరియు యాజమాన్యం నీటీలోకరిగే గంధకం పొడి 3 గ్రాములు లేదా మైకొబుటానిల్ 10% ఆకులపై బూడిద వంటి పదార్థం ఏర్పడుతుంది. గింజ బరువు తగ్గి దిగుబడి పై ప్రభావంచూపుతుందని నివారణ యాజమాన్యం నీటిలో కరిగే గంధకం పొడి3 గ్రాములు ,లేదా మైకోబూటానిల్ 10%నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రాములు లేదా మైకోబుటానిల్ 10% డబ్ల్యూపి 1.5 గ్రా. లేదా సైఫ్లూఫెన్యామిడ్ 5 % ఇడబ్ల్యూ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని ఆయన తెలిపారు.

# బ్రైట్ మైండ్ స్కూల్లో ముందస్తు ఉగాది సంబరాలు



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని బ్రైట్ మైండ్ పాఠశాల లో ముందస్తు కొత్త సంవత్సరం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు బ్రైట్ మైండ్ స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈసందర్భంగా ఉగాది విశిష్టతను గొప్పతనాన్ని పచ్చళ్ళు గురించి విద్యార్థిని విద్యార్థులకు చక్కగా వివరించారు.విద్యార్థిని విద్యార్థులునృత్యాలు,పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి,అలాగే గతనెల లోకడప శ్రీహరి డిగ్రీ కాలేజీలో జరిగిన రాయలసీమ అబాకస్ జోన్ కాంపిటీషన్లో వివిధ పాఠశాలలో నుంచి పాల్గొనగా బ్రహ్మంగారి మఠానికి చెందిన బ్రైట్ మైండ్స్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు కూడా బహుమతులు సాధించారు. ఉగాది సంబరాలకు అతిథులుగా వచ్చిన వీరారెడ్డి శ్రీనివాసాచారి, నరేష్ చేతుల మీదుగా ఆ బహుమతులను ఈరోజు పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆదినారాయణ,సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మంత్రి అచ్చం నాయుడుతో ఎమ్మెల్సీ మర్యాదపూర్వక కలయిక



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి మంత్రి అచ్చం నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి పులివెందుల నియోజకవర్గంలో నష్టపోయిన రైతులు గురించి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా వారికి దృశ్యాలతో సత్కరించి వెంకటేశ్వర స్వామి బొమ్మను అందించి ఆప్యాయంగా పలకరిస్తూ పులివెందుల నియోజకవర్గం లింగాలలో జరిగిన అకాల వర్షానికి రైతుల నష్టం గురించి వివరించడం జరిగింది. అనంతరం వారు కానుకూలంగా స్పందించిన మంత్రి తొందరలోనే ప్రభుత్వము నుండి నష్టపోయిన రైతులు ఆదుకునే విధంగా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 300 మంది పారిశుద్ధ కార్మిక మహిళలకు చీరలు పంపిణీ

### కడప పార్లమెంట్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ముల్లా రహంతుల్లా



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** రంజాన్ పండుగ సందర్భంగా 300 మంది మహిళలకు మరియు పారిశుద్ధ్య కార్మికులకు పేద ముస్లిం సోదరీమణులకు కడప పార్లమెంట్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ముల్లా రహంతుల్లా సొంత నిధులతో ఏర్పాటు చేసిన చీరలను బీటెక్ రవి సతీమణి లత చేతుల మీదుగా కార్మికులకు రంజాన్ తోఫా పులివెందుల పట్టణ బాక్రాపురం, ఇస్లాం పురం ఇంచార్జ్ కడప పార్లమెంట్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ముల్లా రహంతుల్లా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతా రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు ఉపవాసాలు ఉండి సమాజంలోని పేదలకు దానధర్మాలు చేయడం ఎంతో గొప్ప విషయమని టిడిపి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కడప పార్లమెంట్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ముల్లా రహంతుల్లా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాస దీక్షలు ఆచరిస్తూ ఆకలి బాధలు స్వయంగా తెలుసుకుంటూ తోటి వారికి సహాయపడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మరియు పులివెందుల పట్టణం ఇస్లాంపురం, బాకరాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ




**చెన్నూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని శివాలపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం చెన్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ మోహన్ రావు పరిశీలించారు.శివాలపల్లిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి కుంటల తవ్వకాలు పని చేస్తున్న కూలీల స్థితి గతుల పై ఆరా తీశారు. కూలీలు ఎండ వేడికి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అనంతరం మస్టర్లు వెరిఫికేషన్ చేశారు.త్రాగు నీరు,కూలీలకు నీడ తదితర విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. అంతేకాకుండా ఇంటి ఇంటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏమైనా త్రాగునీరు సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అరా తిశారు. అనంతరం గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు,ఫీల్డ్ అసిస్టెంటు శేఖర్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## షేర్ ద విజన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల వితరణ



**కలసపాడు మేజర్‌న్యూస్:** ఖమ్మంకి చెందిన షేర్ ద విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కలసపాడులోని పద్మావతి మహిళా మండలి వృద్ధుల ఆశ్రమమునకు ఒక లక్ష రూపాయలు విలువైన నిత్యవసర సరుకులు అనగా బియ్యము కందిపప్పు, దుప్పట్లు, వంట సామాన్లు ఎలక్ట్రానిక్ వస్తువులు షేర్ ద విజన్ సంస్థ అధ్యక్షులు పొదిలి నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళా మండలి నిర్వాహకులు సానికొమ్ము వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో ఆశ్రమాలకు చేయూతనిస్తున్న షేర్ ద విజన్ సంస్థ యొక్క యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేశారు.

# కలసపాడుకు డంపింగ్ యార్డ్ఎక్కడ మహాప్రభో?

## కసువు దిబ్బలుగా ప్రధాన రహదారులు.దుర్గంధంతో ప్రజలు అవస్థలు




**కలసపాడు, మేజర్న్యూస్:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన పారిశుధ్య, పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తునప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకంగా ఉన్నాయని వాటిపై ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని కలసపాడు మండల సిపిఐ కార్యదర్శి గుడిమే సునీల్ కుమార్ అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కలసపాడులో సూర్య ప్రతినిధితో సీపీఐ మండల కార్యదర్శి గుడిమే సునిల్ కుమార్ మాట్లాడుతూ మండల ప్రజల నుండి వస్తున్న ఆరోపణలు అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయని. మరీ ముఖ్యంగా డంపింగ్, యార్డులనేవి కలసపాడు మం డలంలోనే కనిపించకపోవడం చాలా బాధాకరమని పలువురు సామాజిక దృక్పథం కలిగిన వారు ప్రజాసమస్యలపై స్పందిస్తూ కలసపాడు మండలంలోని తెల్లపాడు క్రాస్ రోడ్డు నందు మార్కెట్ చెక్పోస్ట్, పెట్రోల్ పంపు సిమెంటు ఇటుకల తయారీ కేంద్రం, స్మశాన వాటిక ఉన్న తెల్లపాడు రోడ్డు పై దుర్గంధ భరితమైన చెత్తచెదారం మరణించిన జంతువుల కళేబరాలు వెయ్యటం వల్ల విద్యార్థిని, విద్యార్థులు ఐటీఐ కాలేజి, విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంటి పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ముక్కుమూసుకోనిదే ఈ సెంటర్ నుండి వెళ్ళటం కుదరడం లేదని స్థానిక ప్రజలూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డులు మండల కేంద్రమైన కలసపాడు లోని పుల్లారెడ్డి పల్లె దారిలో, పోరుమామిళ్ల ప్రధాన రోడు నందు తెల్లపాడు రోడ్డు సర్కిల్ వద్ద ప్రజలనుండి వస్తున్న ఆరోపణలుచేసిన ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి ప్రజలకు నష్టం జరుగక ముందే ప్రభుత్వ యంత్రంగం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలతో పాటు సీపీఐ మండల కమిటి సభ్యు లు చేస్తున్నాడిమాండ్ను పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి డిమాండు చేస్తున్నారు. లేని పక్షంలో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

# గర్భిణీల సంక్షేమ పథకానికి తగిన నిధులు కేటాయించాలి : విజయ జ్యోతి



**కడప ఎడ్యుకేషన్, మేజర్న్యూస్ :** వైఎస్ఆర్ కడప జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయ జ్యోతి గర్భిణీలకు అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని జాతీయ ఆహార భద్రతా చట్టం కింద పూర్తిగా అమలు చేయడంలో విఫలమవుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం విజయ జ్యోతి ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సాయం గర్భిణీలకు సరిగ్గా అందడం లేదని, ఇది వారి సంక్షేమానికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. స్వర్గీయ, మాజీ ప్రధాని లిడా. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013 సెప్టెంబర్లో జాతీయ ఆహార భద్రతా చట్టం ను అమలు చేసిందిలి అని విజయ జ్యోతి గుర్తుచేశారు. ఈ చట్టం ఆధారంగా ప్రస్తుత కేంద్రంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం ప్రధాన్ మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ప్రారంభమైంది. ఈ చట్టం ప్రకారం, సంస్థాగత రంగంలో పని చేసే గర్భిణీ స్త్రీలకు లిఒక బాలికకు రూ.6,000 మాతృత్వ భత్యంగా అందించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత లిఎన్డీఏ ప్రభుత్వం 2017లో ప్రవేశపెట్టిన “ప్రధాన్ మంత్రి మాతృ వందనా యోజన” కింద మొదటి బిడ్డకు రూ.5,000 మాత్రమే అందజేస్తోందిలి. రెండో బిడ్డకు కూడా ఈ సహాయం బాలిక అయితేనే వర్తిస్తుందనే షరతు ఉంది. 2022-23లో సుమారు 68% గర్భిణీ స్త్రీలు కనీసం ఒక విడత చెల్లింపును పొందారు అయితే తదుపరి సంవత్సరం, 2023-24లో ఈ శాతం కేవలం 12%కి పడిపోయింద ఇది తగిన నిధుల కేటాయింపు లేకపోవడంతోపాటు, ప్రభుత్వం దీని అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. గర్భిణీ స్త్రీలు మరియు శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగిన నిధులు కేటాయించి, పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అని ఆమె డిమాండ్ చేశారు.

# దేశానికి అన్నం పెట్టే రైతులను కాపాడాలి : గాలి చంద్ర




**కడప ఎడ్యుకేషన్, మేజర్న్యూస్ :** ఈరోజు ఏఐకేఎస్ జాతీయ పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించడం జరిగింది. ఆందోళనకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గాలి చంద్ర మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పనలో, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు మూడు సాగు చట్టాలు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నేపథ్యంలో రైతులకు గుదిబండలుగా మారుతున్న చట్టాలను ఉపసంహరించుకోవాలని ఢిల్లీ సరిహద్దుల్లో 365 రోజులు పాటు ఆందోళన చేసిన నేపథ్యంలో ఆ చట్టాలు వెనక్కి తీసుకుంటామని చెప్పి, కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు పరచడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న నేపథ్యంలో పంజాబు, హర్యానా రైతులు తిరిగి ఆందోళన బాట పట్టడం జరిగిందని, ఈ ఆందోళనను పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వము అలాగే కేంద్ర ప్రభుత్వము తీవ్రంగా అణిచివేయడాన్ని, అక్రమ కేసులు బనాయించడాన్ని చంద్ర గర్హించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడులు కూడా రాక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్య పాలు కావడం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ను ,అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీలకు రైతులను తాకట్టుపెట్టే పరిస్థితి తీసుకురావడం దురదృష్ట కర మన్నారు. రైతులు జీవితకాలం కష్టించి, మలి దశలో జీవితాన్ని సాఫీగా సాగించేందుకు 60 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, కనీస మద్దతు ధరకు పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం వి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య, ఈ బాలచంద్రయ్య, చిలుంగారి పెద్ద పుల్లయ్య, శంకర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు టీ రామ్మోహన్ రెడ్డి, పి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు మహేశ్వర్ రెడ్డి, ఎల్ విజయభాస్కర్ రెడ్డి, పకీరప్ప, ఏ ఐ వై ఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గంగా సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివ, నాయకులు తేజ, అరుణ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీఓ ఆఫీస్ లోని సూపర్డెంట్ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది.

# బద్వేల్ ఆవోప వారి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉగాది కానుక



**బద్వేల్ టౌన్, మేజర్న్యూస్:** బద్వేల్ పట్టణంలో అవోపా వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలకు ఉగాది కానుకను అందజేశారు ఈ కార్యక్రమంలో పలువురు పేదలకు పెన్షన్ అందజేశారు ఇటీవల ఆటో ప్రమాదంలో దెబ్బతిన్న సురేంద్ర కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. పత్తి వెంకటసుబ్బయ్య కుటుంబం వారి సహకారముతో 25మంది పెన్షన్ దారులకు గొడుగులు, టవల్స్ ఇచ్చారు. అలాగే పత్తి పద్మావతమ్మ వారి కుటుంబసభ్యులు పెన్షన్ దారులకు మొకాళ్ళ నోపులకు అయింట్మెంట్స్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నూకల రెడ్డయ్య ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కుప్పం వెంకట సుబ్బారావు కార్యదర్శి కొలిశెట్టి నాగరాజా ఆవోప నాయకులు సివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ ఈ.కె.వై.సి గడువు పొడిగించాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం

## యస్సి,ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు మేకల ఆంజనేయులు



**జమ్మలమడుగు, మేజర్న్యూస్:** ఆధార్ కార్డు అప్డేట్ సర్వర్ స్లోగా ఉండడంతో ఈకెవైసి గడువు పొడిగించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శిరీషా కు యస్సి ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు మేకల ఆంజనేయులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్బంగా మేకల ఆంజనేయులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పై బడిన పిల్లలు మార్చి 31 తేదీ లోపల ఈకెవైసి చేపించుకోవాలని లేదంటే రేషన్ సంక్షేమ పథకాలకు ఇబ్బంది ఎదురవుతుందని అధికారులు చెబుతున్నారని యూఐడి ఏఐ వెబ్సైటు సర్వర్ స్లోగా ఉండడంతో ఆధార్ అప్డేట్ ప్రక్రియ ఆలస్యం అవుతున్నదని, అదేవిదంగా ఈకెవైసి కేవలం రేషన్ షాపుల్లో మాత్రమే చేస్తున్నారని సచివాలయాల్లో చేయడం లేదని దీనివల్ల ఈ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందని ముఖ్యంగా గత నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు దీనివల్ల తెల్ల రేషన్ కార్డుదారులు బయటి మార్కెట్ లో నిత్యావసర వస్తువులు ధరలు ఆఖాశాన్ని అంటుతున్నాయని తక్షణమే పై సమస్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా పదవ తరగతి జీవశాస్త్రం పరీక్షలు



**కడప ఎడ్యుకేషన్, మేజర్న్యూస్ :** కడప జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగింది. జిల్లాలో 161 సెంటర్స్ల లో రెగ్యులర్ 27723 మందికి గాను 27595 మంది హాజరయ్యారయ్యారు. 128 మంది (గైహాజరయ్యారు) ప్రైవేట్ విద్యార్థులు 191 మందికి గాను 179 మంది హాజరు అయ్యారు. 20 మంది గైహాజర్ అయ్యారు. 13 మంది ఫ్లేయింగ్ స్వాడ్ బృందాలు 72 సెంటర్స్ లను, 87 సెంటర్లకు సిట్టింగ్ స్వాడ్లను కటాయించబడినది. కడవి జిల్లా నేడల్ ఆఫీసర్. మధుసూదనరావు 7 సెంటర్స్, జిల్లా విద్యాశాఖాధికారి, యస్.షంషుద్దీన్ 3 సెంటర్లను పరిశీలించారు. ప్రశాంత వారతవరణంలో పరీక్షలు జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి యస్. షంషుద్దీన్ తెలిపారు.

# సంఘీభావ నిరసన కార్యక్రమం



**పెండ్లిమర్రి, మేజర్న్యూస్:** వీరపునాయినిపల్లి మండలం, పంచాయతీ సెక్రటరీ నాగభూషణం రెడ్డి మీద జరిగిన దాడికి నిరసనగా పెండ్లిమర్రి మండలంలోని పలు పంచాయతీ కార్యదర్శులు సంఘీభావ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఉపేక్షించకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సంఘం గౌరవాధ్యక్షులు వి.లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి కే సుధీర్ , డి కిరణ్ మొదలగువారు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

### గ్రీవియన్స్‌డేలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు 'గ్రీవియన్స్ డే' నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత , స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బందికి యొక్క ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.


## సమస్యలపై గళం విప్పిన కౌన్సిలర్లు

### పొంతన లేని సమాధానాలు చెబుతున్న మున్సిపల్ అధికారులు



**పులివెందుల మేజర్‌న్యూస్:** పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు అజెండా అంశాలు చదివి కౌన్సిల్ ఆమోదాలు తెలిపే విధంగా చదివి వినిపించడం జరిగింది. అనంతరం పలు వార్డులలోని సమస్యలపై కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం తెలుపగా కౌన్సిలర్లు ఒక్కింత ఆవేశానికి గురై మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రోడ్డు నందు వీధిలైట్లు వెలిగించమని, అంతేకాకుండా వార్డులలో రేషన్ ఇంటింటికీ పంపిణీ సక్రమంగా చేయడం లేదని రెవెన్యూ అధికారులను కౌన్సిలర్ మూలి మహేశ్వర్ రెడ్డి మున్సిపల్ అధికారులను, రెవెన్యూ ప్రశ్నిస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోని పూర్తి సమాధానం తెలపాలంటూ కౌన్సిలింగ్ సమావేశం ముగిసినప్పటికీ ఎవరు బయటకు వెళ్ళద్దంటూ కౌన్సిలింగ్ సమావేశ హాల్ లో బైఠాయించి అటు రెవెన్యూ అధికారులను మున్సిపల్ అధికారులను నిక్కచ్చిగా ప్రశ్నించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆర్డిఓతో చరవాణి ద్వారా సమస్యలు వివరిస్తూ సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు అనంతరం ఆర్డిఓ సానుకూలంగా స్పందించి సమస్యలు లేకుండా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, పురపాలక కౌన్సిలర్లు కోఆప్షన్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## పంచాయతి కార్యదర్శి ఇంటి పై దాడి హేయమైన చర్య



**అట్లూరు, మేజర్‌న్యూస్:** కడప జిల్లా వీరపునాయని పల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి ఇంటి పై దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని దాడికి నిరసనగా అట్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ బాబు ఆధ్వర్యంలో మండల పంచాయతీ కార్యదర్శులు అందరూ నలుపు రంగు బ్యాడ్జీలను ధరించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు పంచాయితీ కార్యదర్శులపై భౌతిక దాడికి దిగడం తగదని భౌతిక దాడికి దిగడం వల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా కార్యాలయంలో పరిష్కరించుకోవాలని లేనిపక్షంలో పై అధికారులను సంప్రదించాలని హితవు పలికారు ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడే వారిని ఉపేక్షించకూడదని ఇలాంటి దాడులను పునరావృతం కాకుండా ఉద్యోగులకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలను తీసుకోవాలని శుక్రవారం అట్లూరు మండల ఎంపీడీవో భాస్కర్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో అట్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ బాబు పంచాయతీ కార్యదర్శులు ఆనంద్ రావు, సుబ్బరాయుడు, కేశవరెడ్డి మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

### ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయం, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి



**కమలాపురం, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 53,27,761 విలువైన చెక్కులను శుక్లవారం కడప పుత్తా ఎస్టేట్ నందుగల ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు అందజేసిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి మరియుకమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి కమలాపురం మండలంలోని బాధితుల వివరాలు,మర్రి ఆదినారాయణ 30,,0166,, సంఘుబాల మణిదీప్,35,077., రెహిన,47,016, వీర శేఖర్ కి 95,837,, అంజలికి,50.000, నాగేశ్వరమ్మ కి,1,95,999, లక్ష్మీదేవికి,67,700, అమ్మన్ని,37,539, అనూష కి 1,59,061, చిన్న పుల్లయ్య 60,000,లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు సంక్షేమ భరోసాగా నిలుస్తుందని అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ఇది చాలా పెద్ద ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. వైద్యం ఖర్చులను భరించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నిరుపేద కుటుంబాలకు టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధిని మరింత బలోపేతం చేసి అవసరమైన వారికి వేగముగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మరియు టిడిపి పాలనలో ప్రజలకు అండగా నిలిచే కార్యక్రమాలు మరింత వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. కమలాపురం నియోజకవర్గ మండలాలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద 53,27,761 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఆరు మండలాల మండల అధ్యక్షులు కార్యకర్తలు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తట్టుకోలేక యువకుడు బలవన్మరణం...!

### అప్పులోల ఒత్తిడి వల్ల యువకుడు పురుగుల మందు తాగి తనువు చాలింపు..



**బద్వేల్ మేజర్‌న్యూస్ :** అప్పులు ఇచ్చిన వాళ్లు ఒత్తిడి చేయడంలో పురుగుల మందు తాగియువకుడు బలవన్మరణం చేసిన ఘటన బద్వేల్ పట్టణంలో సంచలనం సృష్టించింది. ఇవ్వరాలే గెలితే బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద అగ్రరానికి చెందిన కుమార్36 సంవత్సరాల అనే యువకుడికి భార్య ఒక కుమారుడు కుమార్తె సంతానం కలిగి యున్నారు. తను నమ్ముకున్న భార్యాబిడ్డలను సుఖ సంతోషాలతో చూసుకోవాలనే సంకల్పముతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవాడు అప్పటివరకు వాళ్ళ సంసార జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రయాణం సాగేది కొద్ది రోజుల క్రితం నెల్లూరు రోడ్డులో టీ సెంటర్ కేఫ్ వేరే వారు వ్యాపారం నిర్వహిస్తుండేవారు అనివార్య కారణాలవల్ల ఆ షాప్ యజమాని షాపును తీసివేయడంతో పెద్ద అగ్రరానికి చెందిన కుమార్ చిన్న చిన్న వ్యాపారాలతో ప్రస్తుత పరిస్థితులు పిల్లల భవిష్యత్తు అభ్యున్నతి కొనసాగించడం కష్టతరం అనుకున్నాడో ఏమో గాని మూతపడిన కేఫ్ కాఫీ సెంటర్ ను తలకు మించిన భారమైనప్పటికీ వేలాది రూపాయలు వేచించి ఆ షాపును కొనుగోలు చేసి వ్యాపారం ప్రారంభించాడు కుమారు వ్యాపారం మొదటిలో తను అనుకున్నంత కన్నా వ్యాపారవృద్ధి జరగడంతో మరింతగా వ్యాపారం అభివృద్ధి చేయాలని సంకల్పంతో బయట వ్యక్తుల నుంచి వడ్డీ రూపంలో అధికపెట్టుబడి వేచించి కుమార్ టి అంగడి కేఫ్ హోటల్లు నిర్వహిస్తుండేవాడు ఈ మధ్యకాలంలో చుట్టుపక్కల ప్రదేశాలలో అధికంగా షాపులు ఏర్పాటు చేయడం వల్ల రాను రాను వ్యాపారం మందగించడం తెచ్చుకున్న నగదు వడ్డీలు పెరగడం ఒకపక్క వడ్డీలకు తెచ్చుకున్న వ్యక్తులు ఒత్తిళ్లు అధికం కావడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఎలాగోలా వారికి సర్ది చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ ఉండేవాడు. వ్యాపారంలో వచ్చిన కొంత నగదును వడ్డీ రూపంలో వడ్డీదారులకు చెల్లిస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ ముందుకు సాగుతూ ఉండేవాడు ఈ మధ్యకాలంలో వడ్డీలకు ఇచ్చిన వ్యక్తులు కుమారును అప్పు ఇచ్చిన వారు ఇంటి వద్దకు వచ్చి ఇచ్చిన డబ్బు చెల్లించాలంటూ ఒత్తిడి చేయడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో మరోపక్క వ్యాపారం జరగక నష్టాలు ఊబిలో కురుకు పోయాడు. వ్యాపారం లేక మరో పక్క అప్పుల వాళ్లఒత్తిడి తట్టుకోలేక చావే శరణ్యం అనుకున్నాడో ఏమో తెలియదు గానీ పట్టణంలోని ప్రైవేటు లాడ్జిలో రూము తీసుకొని గత మూడు రోజుల నుంచి మదనపడుతూ అప్పులోలకు డబ్బులు ఎలా చెల్లించాలో అర్థం కాకపోవడంతో మరోపక్క తను నమ్ముకుని వచ్చిన తన భార్య పిల్లలు సమాజంలో ఏ విధంగా జీవనం సాగిస్తారు లేదో అని మదన పడుతూ ఆందోళన చెంది మరణమే దీని పరిష్కారమని అనుకున్నాడో ఏమో గాని తను బస చేసిన లాడ్జి లోకి తన వెంటపొలాలకు వేసే పురుగుల మందు తెచ్చుకుని కూల్ డ్రింక్ లోకలుపుకొని సేవించడంతో ఆయన మృతి చెందాడు.. లాడ్జికి సంబంధించిన రూమ్ బాయ్ రూము నుంచి కుమార్ రాకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టిన స్పందించకపోవడంతో వెంటనే ఈ విషయం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ సమాచారం అందించగా వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రూము వాకిలి తెరిచి చూడగా కుమార్ చనిపోయి విగతాజీవిగా పడిపోయి ఉన్నాడు. పోలీసులు రూమును పరిశీలించగా కుమారు తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా కూల్ డ్రింక్ కుమార శవం పక్కనే పడి ఉండడం గమనించారు వెంటనే కుమార్ కుటుంబ సభ్యులకు పోలీసులుసమాచారం అందించిన అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


## ప్రశాంతంగా ముగిసిన మండల సర్వ సభ్య సమావేశం

**చాపాడు మేజర్‌న్యూస్ :** చాపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలోని సభా భవనంలో మండల అధ్యక్షులు లక్షుమయ్య అధ్యక్షతన ప్రశాంతంగా ముగిసింది. సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను గురించి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుండి ఏఈ మాట్లాడుతూ మండలంలో ట్రాన్స్ఫార్మర్ల సమస్య ఉందని త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో, మండల ఆధికారులు, సర్పంచులు,ఎంపీటీసీ లు, తది తరులు పాల్గొన్నారు.



# కర్నూలు పై కన్నెర చేసిన బాబు

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి




పులివెందుల, మేజర్‌న్యూస్ : తెలుగు ప్రాంతాల ఏకీకరణ కోసం తనను తాను త్యాగం చేసుకున్నటువంటి గడ్డ నా ఈ కర్నూలు. అటువంటి ఈ కర్నూలు గడ్డమీద ఏమాత్రమే గాని జాలిదయా చూపని ప్రస్తుత రాజకీయనాయకులు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రము ఏర్పడినటువంటి సందర్భంలో రాష్ట్రానికి రాజధానిగా నిలబడినటువంటిది కర్నూలు. అటువంటి కర్నూలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం తన రాజధానిని త్యాగం చేసినది , తెలంగాణ విభజన తర్వాత అదే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటికీ రాజధానిగా ఉండవలసిన కర్నూలు, రాయలసీమ నాయకుల పదవీకాంక్షకు ఆంధ్ర ప్రాంత నాయకుల కుట్రలకు బలై తన అస్తిత్వాన్ని కోల్పోవుతున్నది. ఆంధ్ర ప్రాంత నాయకుల యొక్క కుట్రలను కుతంత్రాలను ఎరిగినటువంటి పూర్వపు రాయలసీమ ప్రాంత నాయకులు మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడే సమయంలో ఆంధ్ర ప్రాంత నాయకుల వద్ద నుంచి కొన్ని స్పష్టమైనటువంటి హామీలను పొందినారు, దానినే బాగ్ ఒడంబడిక అని అంటారు. రాయలసీమ ప్రాంతంలో రాష్ట్ర రాజధాని ఉండేలా, కృష్ణానది యొక్క జలాలలో అత్యధిక ప్రాధాన్యత రాయలసీమ ప్రాంతానికి కలిగేలా ఇక్కడ సాగు త్రాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకునేలా ఒప్పందాలు చేసుకున్నారు, కానీ కాలక్రమంలో సిద్దేశ్వరం అలుగు వద్ద డ్యామును నిర్మించకుండా శ్రీశైలం ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టు కింద కాకుండా విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా నిర్మించి నాగార్జునసాగర్ డ్యామ్ కు ఓవర్ హెడ్ ట్యాంక్ మాదిరి మార్చి వేశారు. దీనివలన రాయలసీమ ప్రాంతంకి నీటి సౌకర్యము లేకుండా చేశారు విభజిత ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రథమ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి నారా చంద్రబాబునాయుడు రాయలసీమ ప్రాంత వ్యక్తి అయినప్పటికీని రాయలసీమకు న్యాయముగా రావలసినటువంటీ రాజధానిని కర్నూలు ప్రాంతానికి రాకుండా కులతత్వంతోను వ్యక్తిగత ప్రాపగండ కోసము కీర్తి ప్రతిష్టల కోసము అమరావతి ప్రాంతానికి తరలించారు తర్వాత వచ్చినటువంటి వైకాపా ప్రభుత్వము తమ విధానాలలో భాగమైనటువంటి వికేంద్రీకరణ పద్ధతి ద్వారా కర్నూలులో ఏర్పాటు చేయవలసినటువంటిది పరిపాలన రాజధాని, కానీ హైకోర్టును ఏర్పాటు చేయుటకు ప్రయత్నం చేసి కనీసంలో కనీసమైన రాయలసీమ ప్రాంతానికి జరుగుతున్నటువంటి అన్యాయంని కొద్దిపాటిలో అయినా సరిదిద్దే ప్రయత్నం చేశారు ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ని పాక్షికంగా అభినందించవలసినదే. కానీ ఆ సమయంలో కూడా ఆంధ్ర ప్రాంతంలో ఉన్నటువంటి వారి ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి పత్రికలలో కర్నూలులో హైకోర్టు వస్తే ఏమి ఉపయోగము నాలుగు జిరాక్స్ మిషన్లు మూడు కంప్యూటర్ సెంటర్లు వస్తాయి అంతే కదా అని వెటకారం చేశారు, మరియు కర్నూలుకు హైకోర్టు రాకుండా ఆంధ్ర ప్రాంతంలో పెట్టుబడిదారుల సహకారంతో ఉద్యమం నడిపించారు అది కూడా పత్రికలలోనూ టీవీలలోనూ విపరీతమైనటువంటి ప్రచారం గావించినారు. అదే రాయలసీమ ప్రాంతం ప్రజలు హైకోర్టు కర్నూలుకు కావాలి అని చెప్పి ప్రతి జిల్లా కేంద్రంలోనూ కొన్ని సంవత్సరాలు రిలే నిరాహార దీక్షలు చేసినప్పటికీ ఏ పత్రికలలో కూడా ప్రచురణకు నోచుకోలేదు, కడపలోనే కోటిరెడ్డి సర్కిల్ దగ్గర దాదాపు నాలుగు సంవత్సరాలు హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలి అని జూనియర్ లాయర్లు ప్రతి దినము రిలే నిరాహార దీక్ష నిర్వహించినారు, కానీ ఈ విషయము ఏ ప్రముఖ పత్రికలలో కూడా ప్రముఖముగా ప్రస్తావించబడలేదు. అదే కర్నూలు జిల్లాలో హైకోర్టుతో పాటు న్యాయ విశ్వవిద్యాలయం కూడా నిర్మాణము జరిగే ప్రయత్నం జరిగినది. దీనివలన విశ్వవిద్యాలయంలో చదువుతున్నటువంటి విద్యార్థులకు సమీపములోనే హైకోర్టు ఉండటం వలన వారి యొక్క నైపుణ్యతను పెంచుకునే దానికి ఎంతో అవకాశం ఉండేది. ప్రస్తుతం వచ్చినటువంటి ఎన్డీఏ ప్రభుత్వము హైకోర్టును కూడా కర్నూలు నుంచి అమరావతికి తరలించే ప్రయత్నం చేస్తున్నారు ప్రస్తుతము ఏ మీడియా కూడా హైకోర్టును కర్నూలు నుంచి అమరావతికి తరలిస్తే వచ్చే ఉపయోగమేముంటుంది ఒక నాలుగు జిరాక్స్ మిషన్లు మూడు కంప్యూటర్ సెంటర్లే కదా అని వెటకారం చేయడం లేదు రాయలసీమ ప్రాంతంలో ఏ కొద్దిపాటి అభివృద్ధి జరుగుతున్న దన్న ఆంధ్ర ప్రాంత నాయకులు విలవిలలాడిపోతారు. సరే ఎలాగూ వారి వారి వ్యక్తిగత ప్రతిష్టపెంపు కొరకు అమరావతి కోసం ప్రాకులాడుతున్నారు కావున పోనీలే అని అనుకున్నప్పటికీ నిన్న మొన్న జరిగినటువంటి విషయాలు చాలా చాలా బాధ కలిగిస్తున్నాయి శ్రీశైలం వద్ద సిద్దేశ్వరం నందు తీగల వంతెన ప్రతిపాదన చేసి ఆమోదించడం మరీ దారుణం సిద్దేశ్వరం అలుగును బ్యారేజీ కం బ్రిడ్జిగా నిర్మిస్తే రాయలసీమ ప్రాంతానికి నీటి వెసులు బాటు జరిగేది. ఈ అంశం మీద గతంలో విపరీతముగా మాట్లాడినటువంటి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, వారి కుమార్తె ప్రస్తుత ఎంపీ అయినటువంటి శ్రీమతి బైరెడ్డి శబరి కూడా స్పందించకపోవడం రాయలసీమ ప్రజల దౌర్భాగ్యం రాయలసీమ అంశము వారి వారి యొక్క పదవుల సాధనకు మాత్రమే ఉపయోగపడే ఒక బ్రహ్మాస్త్రం అవుతున్నది అనేది స్పష్టం. కృష్ణా నది జలాల యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని కర్నూలు నందు స్థాపించేదానికి చాలామంది ప్రతిపాదనలు పంపారు, కానీ చంద్రబాబు నాయుడు దీనిని కూడా అమరావతికే తరలించారు. నారా చంద్రబాబు కర్నూలుకు రావలసినటువంటి రాజధానిని రాకుండా చేశారు, వస్తున్నటువంటి హైకోర్టును కూడా రాకుండా తిరిగి తీసుకెళ్లారు మరియు సిద్దేశ్వరం తీగల వంతెన కాకుండా బ్యారేజీ మరియు రోడ్డువంతెనగా మార్చే దానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించకుండా కర్నూలు అభివృద్ధి మీద కన్నెర చేస్తున్నారు.

# హామీల జీవోలకై ఆశాలు

### ఏప్రిల్ 1 నుండి 21 వరకు ఉద్యమ బాట - జయప్రదం చేయాలని గుంటి వేణుగోపాల్ ఆశాలకుపిలుపు

కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ఆశాలవేతనాల పెంపు,ఉద్యోగులుగా గుర్తింపు, 62 సంవత్సరాల రిటైర్మెంట్ వయసు పెంపు 150 రోజులు మెటర్నిటీ సెలవులు, గ్రాట్యూటీ, క్యాజువల్ సెలవుల హామీలకు జీవోలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా ఏఐటియుసి కార్యాలయంలో యూనియన్ నగర అధ్యక్షురాలు ఏ. లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన ఏపీ ఆశా వర్కర్ యూనియన్ నగర సమితి సమావేశం జరిగినది. ఈ సమావేశంలో గుంటి వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు ఇచ్చిన హామీలకు జీవోలు విడుదల చేయాలని వేతనాలు పెంచాలని, సాధారణ సెలవులు, ఉద్యోగ భద్రత, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పెర్మనెంట్ చేయాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్5 లక్షలు, స్మార్ట్ ఫోన్లు, 10 లక్షల రూపాయల ఉచిత ప్రమాద ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలనిఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు ఇవ్వడం జరిగినది. రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు ఏప్రిల్ నెల 1వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉద్యమ కార్యచరణ ప్రకటించటం జరిగిందని అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ డాక్టర్లకు, 8వ తేదీ మండల తాసిల్దార్లకు, 11వ తేదీ



రెవెన్యూ డివిజనల్ అధికారికి, 15వ తేదీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతి పత్రాలు ఇవ్వాలని, ఏప్రిల్ 21వ తేదీ చలో కడప కలెక్టర్ ఆఫీస్ మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు ఈ ఉద్యమ కార్యకరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పిచినేని సుబ్బరాయుడు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బి శాంతమ్మ యూనియన్ నాయకులు రాణి, వెంకట కుమారి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్సీ

# డిసి గోవిందరెడ్డికి ఆహ్వాన పత్రిక



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : పోరుమామిళ్ల పట్టణానికి సమీపంలోని టేకూరుపేట రోడ్డులో గల బండి నరవ ప్రాంతంలో 108 శివలింగాలతో ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన శ్రీ నందీశ్వరస్వామి దేవాలయ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి కి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేసి, సాదరంగా పిలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల శాఖ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఫణిరావు, దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సహ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు గురు ప్రసాద్, శిరీష్, వరప్రసాద్, బాలచంద్రుడు, రవీంద్రారెడ్డి, సురేంద్రారెడ్డి, రాంభూపాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, చెన్నయ్య, చాపాటి సాయి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నాపత్రం లీకేజ్ పై జిల్లా ఎస్పీ గారు పూర్తి దర్యాప్తు చేపట్టాలి

### ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్

### డిఈవో కార్యాలయం ఎదుట ఆర్ఎస్ఎఫ్ ఆందోళన




**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పదవ తరగతి గణిత ప్రశ్నాపత్రం లీకేజ్ కుంభకోణంలో అసలు సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, విద్యాసంస్థలు గుర్తింపు రద్దు చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం సిండికేట్ అయి వారి స్వలాభం కోసం ప్రశ్నాపత్రం లీకేజ్ చేసి, అసలు ప్రభుత్వ ఉపాధ్యాయులు పేపర్ లీక్ చేస్తే వారికి వచ్చే ప్రయోజనం ఏముంది, ప్రవేట్ స్కూల్స్ యాజమాన్యల ప్రయోజనాల కోసం, సిం డికేట్‌లో భాగస్వాములుగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకుల లోపాయికాయి ఒప్పందంతోనే ప్రభుత్వ ఉపాధ్యాయులు బలి చేశారని సాక్షాత్తు డిఇఓ వేంపల్లిలో ప్రశ్నాపత్రం లీకేజ్‌ను పట్టుపడితే అక్కడి వారిపై చర్యలేవి. సిండికేట్ అయిన కరస్పాండెంట్స్‌పై చర్యలు తీసు కోకపోవడంలో అంతర్య మేమిటని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఎం.ఓబులేసు యాదవ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లూరులో ప్రశ్నాపత్రం లీక్ చేసి, వేంపల్లి కి వాట్సాప్ ద్వారా పంపడం అంటే ముందుగానే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం సిండికేట్ అయి లక్షల రూపాయలు చేతులు మార్చుకొని పక్కా ప్రణాళిక బద్ధంగా చేశారని ఆరోపించారు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కీలక నేత కనుసన్నుల్లోనే ఈ వ్యవహారం అంతా నడిచిందని ఆరోపించారు డీఈఓ స్వయంగా వేంపల్లి గర్ల్స్ హైస్కూల్లో వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నాపత్రాన్ని లీక్ అయిందని చెప్పారని వీటికి కారణమైన వారిపైన చర్యలకు ఫిర్యాదు చేసిన సందర్భం లేదన్నారు. ప్రశ్న పత్రం లీక్ అయినా వేంపల్లి పరీక్ష కేంద్రంలో ప్రయివేట్ స్కూల్ యూనియన్ నాయకుని ఎక్కువ మంది విద్యార్థులు వున్నారని అక్కడ సర్క్యూలేట్ చేసిన ఆ స్కూల్ యాజ మాన్యం.ఈ కుంభకోణంలో పాత్రధారులపై మాత్రమే కేసు నమోదు చేసి అసలు సూత్రధారు లను తప్పించడానికి పులివెందులలో ప్రైవేట్ స్కూల్లో కరస్పాండెంట్ వేంపల్లిలో ఉన్నటువంటి స్కూల్ అసోసియేషన్ కరస్పాండెంట్ పేర్లు బయటికి రానీయకుండా వైకాపా హస్తం ఎమ్మెల్సీ గారిని తెర వెనుక మద్దతు కారణంగానే సిండికేట్ అయిన వారి పేర్లు బయటికి రాకుండా ఉం డడానికి కారణం అని ఆయన ఆరోపించారు ఈ లీకేజీ వ్యవహారం మొత్తం వేంపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మరో పులివెందుల స్కూల్ యాజమాన్యం కీలకంగా వ్యవ హరించాలని అందరికీ తెలిసిన వారి పైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డిఇఓను ప్రశ్నించారు. వీళ్ళ విద్యా వ్యాపారం కోసం ర్యాంకుల కోసం ముగ్గురు ప్రధాన స్కూల్స్ యాజ మాన్యం కుట్ర పద్దారని మండిపడ్డారు. కేసులో ప్రధానమైన సూత్రధారుల పేర్లు లేకుండా యాజమాన్యం లాభం చేస్తూ వీరి వెనకాల వైసీపీ హస్తం ఉందని ఆరోపించారు. తక్షణమే ఆర్జెడి గారు ప్రశ్నాపత్రం లీకేజ్ పై ఎస్పీ గారికి ఫిర్యాదు చేయాలని సూచించారు అసలు సూత్రధా రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ వైఫల్యం చెందడానికి ప్రధాన కారణం జిల్లా కోఆర్డినేటర్ గా ఉన్నటువంటి సాంబశివారెడ్డి గారు ఒక్కో విద్యార్థి నుండి పదివేలకు పైచిలుకు వసుళ్ళకు పాల్పడి, రాసుకోరా సాంబ అని ఇస్తారాజ్యంగా మాస్ కాఫింగు పాల్పడ్డారని తెలిపారు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ గా ఉండడా నికి ఏమాత్రం అర్హత లేకపోయినా ఆనాటి డీఈవో అనురాధ గారిని మేనేజ్ చేసుకుని అక్రమ మార్గంలో పోస్టింగ్ వేపించుకున్నారన్నారు, గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనంతపురంలో రూపాయి డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డికి ఎన్నికల ప్రచారం నిర్వహించి డబ్బులు స్వయానా సాంబశివరెడ్డి వాటా పంపిణీ చేసిన దృశ్యాలు కళ్ళ ముందు కనబడుతున్న కళ్ళుండి కనపడని కబోది లాగా డీఈఓ వ్యవహరించడం సిగ్గుచేటన్నారు ఎస్ జి టి పోస్ట్ వారికి ఇవ్వాల్సిన పోస్టులు హెడ్మాస్టర్ గా ఉన్న సాంబశివరావు గారికి ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు తక్షణమే ఆరు కోట్ల కుంభకోణంపై విచారణ చేపట్టాలి, సాంబశివరెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్, జిల్లా కార్యదర్శి రెడ్డి సాయి, నాయకులు సన్నీ, హరి, శశి, భార్గవ్, హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు